# పరీక్ష

తెన్నేటి వెంకటరామమూర్తి గారు

౧

నేను చెన్నపట్నంలో పట్టపరీక్షక్లాసులో చదువుతూన్నపుడు జరిగినవిషయము. అప్పటికి నాకింకా పెళ్లి అవలేదు. చాలా సంబంధాలు వస్తూన్నవి. మావాళ్లు పదేపదే నాకు జాబులు వ్రాస్తూండిరి. కాని నాకు మాత్రము విద్యపూర్తి అయేదాక వివాహము చేసుకోవాలని లేదు. మరొక్కసంగతి కూడాను: నాకుమాత్రము పూర్వీకులపద్ధతు లీవిషయములో ఏమీ నచ్చలేదు. నచ్చలేదని అసహ్యము లేదుగాని, అట్లాగా పెళ్లిళ్లు చేస్తున్న వారిని చూస్తే జాలివేసేది. దేశములో సంఘసంస్కరణము చాలాకావాలసి తలచేవాడిని. రోజూ నాకివే ఆలోచనలు. రోజూ మావాళ్లు ఏదోఒక సంబంధము గూర్చి వ్రాస్తూనే యుండేవారు. ఎన్నియో సంగతులు వ్రాసేను; ఇప్పుడు చేసుకోనన్నాను; విద్య పూర్తి కావాలన్నాను; ఇతరదేశాలు తిరిగిరావాలన్నాను; పెద్దపిల్ల కావాలి; తగిన విద్య, కుటుంబగౌరవము, కలిగియుండాలి; పిల్ల గుణవంతురా లని నాకు బోధపడా లన్నాను. ఏమన్నాగాని ఏదో తగిన సంబంధము చూచి యీ మాఘమాసములో వివాహ మాడక తప్పదని మాఅమ్మ గట్టిగా పట్టుపట్టింది. మా అమ్మఅంటే నా కతిప్రేమ. ప్రేమయే కాదు అతిగౌరవము కూడాను. ప్రేమచేతనైతేనేమి, గౌరవముచేతనైతేనేమి, ఆమెను సంతోషపెట్టుదామనే యుద్దేశముచేతనైతేనేమి, ఈయేడు పెళ్లి చేసుకుందామనే నిశ్చయించేను. చెన్నపట్నంలోనే యొకసంబంధముంది. పిల్లకి 15 ఏండ్లు వుండునట. స్కూలుఫైనలు చదువుతూంది. తండ్రి ప్లీడరు. వారు చాలాతొందరపడుతున్నారు. వచ్చి చూసుకోమని మావారికి చాలామార్లు వ్రాసిరి. అయినా నేను మాత్రము తగినపరీక్షచేసి, నాకు యిష్టమైతేనే కాని వివాహమాడడానికి నిశ్చయించుకోలేదు. ఇంకొకవిషయము కూడాను. ఆడవారికి తగినస్వేచ్ఛ యిచ్చి వారలకు మనపై వలపు గలిగినపుడే వివాహము సంభవమని యెంచేవాడిని.

౨

నేను ఆరోజే పిల్లని చూడ్డానికి వెళ్లటానికి నిశ్చయించుకున్నాను. సాయంకాలము 4 గంటలకల్లా మామూలుకన్న ఎక్కువగా 'టాయిలెట్టు' చేసుకుని, తగినదుస్తులు ధరించి బయలుదేరాను. నా కేవేళైనా ఏకారణము చేతైనా 'టెన్నిసు' మానిటమంటే అతి కష్టముగా వుండేది. అంచేత 'బేటు' కూడ పట్టు

కునే వాళ్లింటికి వచ్చాను. మా హాస్టలుకి అదెంతో దూరముండదు. మహావుంటే మూడు ఫర్లాంగులు వుండవచ్చును. అంచేత నడిచే వెళ్లాను. తలుపు తీసివుంది. సావిడిలో చాలా కుర్చీ లున్నాయి. వీధిగుమ్మముకు ఎదురుగా ఒకగుమ్మ ముంది. దానికి చేతితో అల్లిన తెర వుంది. సావిడికి ప్రక్కగా ప్లీడరుగారి ఆఫీసు గది. నేను వెళ్లే సరికి సావిట్లో ఎవరో అతిమాధుర్యముగా పాడుచున్నారు. నేను వెళ్లటమా మానటమా అని సంశయము కలిగింది. 'ఎవరైతేనేమి? నే నెందుకు వెళ్లకూడదు? ఒకవేళ నేను చూడబోయినపిల్ల అయ్యేవుండకూడదా! అయితే నేను వచ్చినపని మరీ సులభసాధ్యమగు' నని ఆలోచించి గబగబ లోపలికి వెళ్లి కుర్చీలో కూర్చున్నాను. ఆపె కూడా పాటపాడుతూనే ఒక్కమారు నావైపు దృష్టి ప్రసరించి మళ్లీ తనరాగ మెత్తుకున్నది. ఆపిల్లకు 16 సంవత్సరములు వుండవచ్చును. ఆ మొగము చూచిన కొలదిచూడాలనే వుంది. ఇంత పెద్దపిల్ల పెళ్లికూతురు కాదని నిశ్చయించుకున్నాను. ఒకటేదృష్టిగా చూస్తున్నాను. నాడు తలంటి నీళ్లుపోసుకుని వుండవచ్చును. నూనె రాసి దువ్వుకోలేదు. కొన్ని ముంగురులు ఫాలభాగముపై పడుతున్నాయి. జడ సగమువరకు అల్లివుంది. ఆవిగ్రహము యింకా నాకళ్లముందర కట్టినట్టు వుంది. ఇట్లా ఏకదృష్టితో యిదివర కెవరినిచూచి ఎరుగను. అసలు నాకు ఆడవారిని చూడ్డానికిగాని, వారితో మాటాడ్డానికిగాని సిగ్గు వేసేది. కాని నేడుమాత్రము దృష్టి త్రిప్పుకోలేకపోయాను. చాలామార్లు ప్రయత్నించాను. ఇంతకు ఆమె ఎవరిసౌభాగ్యమోకదా! ఇట్లా నేను



"నాన్నగారింటివద్ద లేరండి"

పరధ్యానముతో వున్నసమయములో ఆమె పాట మానివేసి 'నాన్నగా రింటివద్ద లేరండి' అనుచు ముద్దు లొలుకుచు పలికేసరికి నాకు తెలివివచ్చి నేను చేసినతప్పు తెలిసికొన్నాను. నే నిట్లు పరస్త్రీయెదుట కూర్చుంటమేకాక వచ్చినపనియైన చెప్పకపోవటము చాలా పొరపాటని అనుకున్నాను.

'పోనిండు, నాన్నగారు ఎప్పుడు వస్తారు?' అని అడిగాను. 'యింకా గంటకుగాని రారు. ఏమైనా పని యున్నయెడల కూర్చొనుడు. కాకపోయిన మీపేరు వ్రాసియిచ్చిన నేను యిచ్చివేయుదును.' అనడముతో నేను ఒక కాగితముమీద నాపేరు వ్రాసియిచ్చాను. కాని, ఏమో నాకే అదేమి అంతమంచిపనిగా తోచలేదు. 'పోనీలెండు; యిట్లా యిచ్చి వేయుడు. నేనే రేపో ఎప్పుడో వస్తాన'ని చెప్పి దగ్గరకు వెళ్లేను. అప్పుడే నాపేరు చూచినది. ఇంతకుముందే తండ్రి యింటిదగ్గిర చెప్పి యుండవచ్చును. ఎందుచేతనో కాని చిరునవ్వుతో 'సరే' యని లోపలికి వెళ్లిపోయినది. యింకాకొద్దికాల మామెతో సంభాషించుదామని కుతూహల మున్నదిగాని ఆమె ఏమనుకొనునో అని భయపడి వూరుకున్నాను. అయినా కొద్దిగా ధైర్యముచేసుకొని 'మీ అమ్మగారున్నారా!' అని అడిగేను, 'యింట్లో పనిచేసుకుంటూన్నారు. పిలవనా!' అనేసరికి 'వద్దులెండు' అని ఎలాగో చెప్పేను. అప్పుడే ఆమె లోనికి వెళ్లటానికి ప్రయత్నించడము చూచి నేను తొందరగా 'మీచెల్లె లున్నదా? అన్నా, రెండునిముషాలు అల్లావుండి పోయి చూచివస్తానని లోనకు వెళ్లిపోయింది. అప్పుడు నాపొరపాట్లన్నీ ఒకటొకటి జ్ఞప్తికి వచ్చాయి. నన్ను జూచి ఆమె ఏమనుకుంటుందో అని చాలావిచారించేను. ఏమైనా సరే, యింకఅక్కడ వుండడము మంచిపనికాదనియెంచి వీధిగుమ్మముదాకావచ్చాను. కాని నాకు పైకిపోటానికి కాళ్లు రాలేదు. ఆమె కనుక్కొని వస్తానందికదా ఎందుకు వుండకూడదని మనస్సుకు సమాధానము చెప్పుకున్నాను. యింతలో ఆమెవచ్చి యింకా 'యింటికి రాలే'దన్నది. 'రేపుసాయంకాలము వస్తానని మీ నాన్నగారితో చెప్ప'మని అక్కడనుండి వెళ్లిపోయాను!

## 3

ఇంకా 5 గంటలు అయినా అవలేదు. అయినా ఆవేళకి టెన్నిసుకి పోటానికి మనస్సు సరిగాలేదు. తిన్నగా నాగదికే పోయాను. తలుపు లోపలగడియి వేసుకున్నాను. పరుపుమీద పడుక్కొని నేనుచూచినపిల్లనుగూర్చియే ఆలోచిస్తూన్నాను. నాకు మరేమియు తోచలేదు. నేచేయుచున్నది న్యాయమా అనినైనా తలపోయడానికి వీలు చిక్కలేదు. 'ఆపిల్లకి వివాహము అయివుండదేమో! ఇది ఒక భ్రమ. చెల్లెలికి వివాహ ప్రయత్నము జరుగుటెటులు? పెద్దదానికి వివాహము జరుగకపోవట మసంభవముగా తట్టింది. ఇంతకుచెల్లెలుమాత్రము యింతసుందరముగా ఉండకూడదా యేమిటి! ఏమో? నేనుజూచినమూర్తియే పెళ్లికూతురు కాగూడదాయేమి!

కాదని నిరూపణ ఏది? ఇది ఒకవెర్రిభ్రమ లాగే వుంది. అయితే నేనుధన్యుడనే!

ఇంతలోనే తెలివి వచ్చినది. నాకు కలిగిన భావములు ప్రథమసందర్శనముననే కలిగిన వలపుగా నిశ్చయించేను. అంచేత అది నిజమైనప్రేమ కాదనియు తగినపరీక్ష చేయాలనియు స్ఫురించింది. "ఇంతకు ఆమె కూడా నన్ను ప్రేమించవలదా? ఆమెకునాపై వలపు కలుగవలదా? లేదా ఏమి?"

రాత్రి అప్పుడే 7 గంటలు అయింది. తోడనే భోజనానికి పోయాను. రాత్రి నిద్దురలేదు. ఈతలంపులే. ప్రొద్దున్న బడికిపోయానుగాని పాఠము లేమీ తలకెక్కలేదు. గంటసేపు ఎట్లాగో బడిలోకూర్చున్నాను. ఇంక లాభము లేదని యింటికి వెళ్లిపోవచ్చాను. సాయంకాలము 4 గం. దాకా ఎట్లాగో గడిపేను. అప్పుడు బయలుదేరుదామనుకున్నానుగాని వాకెవ్వరు వుంటారో వుండరో అనిచెప్పి అప్పటికి టెన్నిసుకి పోయాను. 6 గంటలకె వెళ్లటానికి నిశ్చయించాను.

౪

కమలని తీసుకువచ్చారు. నేనొకకుర్చీలో కూర్చున్నాను. ప్లీడరుగారును నా ప్రక్కనే యున్నారు. తల్లికూడా ఎదురుగుమ్మముదగ్గిర ఒక కుర్చీలో కూర్చున్నది. ప్రక్కన కొద్దిగా క్రీనీడలో కమల నిల్చున్నది. కమల రాగానే నిశ్చేష్టుడై పోయాను. నిన్నజూచిన పిల్లయే అనుకున్నాను. కాదు. ఆమెకన్న ఒకయేడాది చిన్నదై యుండవచ్చు. నిన్న జూచిన పిల్లకి ముంగురులు మొగము మీద పడే లాగు క్రాపింగు అందము లేదేమొ! అయినా యిరువురకు భేదము అంతగా కానరాదు. ఈమె కొద్దిగా నీరసముగా ఉండేమో అనిపించింది. కమల నన్నంతతీక్ష్ణముగా చూడలేదు. సిగ్గుచేకాబోలు మొగము వంచుకుంది. నేను వచ్చేటప్పుడు ఎన్నోప్రశ్నలు వేద్దామనుకున్నాను. కాని యిప్పుడు నాకు చాలా సిగ్గేసింది. నిన్న నేజూచినపిల్లనుగురించి అడుగుదామని నాలుగైదుసార్లు ప్రయత్నించేను. కాని బాగుండదేమోయని మళ్లా ఊరకుండేవాణ్ణి. బడికిపోయి ఏదియో కారణముచేత రాలేదో, లేక యేసినిమాకు వెళ్లినదో యనియెంచేను. చూచుకోడమైనది. కమల లోపలికి వెళ్లిపోయింది. తరువాత అరగంట సేపు దాక ఏమేమొ మాట్లాడుకున్నాము.

నేనూ యింటికి బయలుదేరాను. ఇల్లు చూట్టానికి లోపలికి రమ్మన్నారు. నేజూడబోయినలతాంగి ఆలో నెక్కడైన ఉన్నదేమో అన్న యనుమాన మింకను నాలో వదలలేదు. 'సరే' అన్నా. ఆయిల్లంతా చూచాను. ఎట్టకేలకు బయలుదేరి బయటకు వచ్చేస్తున్నా. గుమ్మముదగ్గిర కమల కనబడ్డాది. అక్కడ యింకెవ్వరూ లేరు. ధైర్యము చేసుకుని "మీఅక్కయ్య ఏదీ" అన్నా. నన్ను చూడకుండానే ఒకనవ్వు నవ్వింది. నేను మాత్రము చూచాను. నాకు చాలాకష్టమనిపించింది. ఇంక కమలమీద ఏమాత్రము మనస్సు పోలేదు. అయినా నాప్రశ్నకు జవాబుకోసము వేచియున్నాను.

'శ్యామల సినిమాకువెళ్లినది' అనుచూ లోపలికి వెళ్లిపోయింది. నేకోరినదానికన్న



"మీ అక్కయ్య ఏదీ!" అన్నా.

ఎక్కువే తెలిసింది. ఇప్పుడు కమలని చాలా మెచ్చుకున్నాను. 'శ్యామలా!' ఆహా, ఆపేరు నుచ్చరించుట ఎంత ఆనందముగా ఉన్నది. శ్యామలకొరకై సినిమాకునేనుకూడా బయలుదేరాను.

౫

అప్పుడే వారమురోజులు గడచినాయి. మళ్లీ వాళ్లింటికి వెళ్లటానికి సందర్భము కుదరలేదు. పనిలేకుండా పదేపదే వారింటికి వెళ్లటము బాగుండ దనుకున్నా. కాని నామనోవేదనకు అంతములేకుండా అయిపోయింది. ఇంతకు కమలపై నాకు యిష్టము లేదు కదా, శ్యామలనే అడిగేద్దా మనుకున్నా.

ఒంటరిగా దొరకునో, దొరకదో? ఒకవేళ ఒంటరిగా ఉన్నాను పలకరించుట భావ్యము కాదేమో? పోనీ, ఏదో ధైర్యముచేసి పలకరిద్దా మనుకుంటే నా ప్రేమ నాదరించునను నమ్మక మెక్కడ! అయినను మొండి ధైర్యముతో సాయంకాలము వాళ్లింటివైపు వెళ్లాను. అప్పుడే, ఎవరో సావిడిలోనుంచి ఆఫీసుగదిలోనికి వెళ్లారు. శ్యామలే అనుకున్నాను. దైవము నాయందు వుందేమో! అదృష్టవశాత్తు ఏ శ్యామలయొక్క దర్శనమైన లభించదేమో యని సందియపడిన యా శ్యామలామూర్తితో సంభాషణకు కూడ సమయము కూడునేమో! సరియేయని చటాలున లోపలకు వెళ్లి గదిలోనికి చూచాను. శ్యామలే.! ఒళ్లు పులకరించినది. అప్పుడే [illegible]జా

భయములు నన్నావేశించినవి. నోటిమాట రాలేదు. నన్ను జూచి ఆమె లోపలికి వెళ్ళిపోయిన దేమో అనుకున్నా? కాని నేను గుమ్మమునకు ఎదురుగా నిల్చున్నాను. నేను అంతలోనే ఒక అడుగు ముందుకువేసి ఆ కోమలి హస్తమును గ్రహించాను. అదంతా మొండిధైర్యమే. మోహ మెంతచేయును. నా కప్పుడు యుక్తాయుక్త వివేకముండని ఎవరంటారు? కాని, అందులో మరొక్క సంగతికూడాను. ఏమూర్తి కొరకై యిన్నాళ్లు నిద్రాహారములు లేక నిరీక్షించి యుంటినో యాసుందరవిగ్రహము నా యెదుటబడ్డప్పుడు,—నాయెదుటనిల్చుటేకాదు- నన్నుఁజూచి నాపై తననిర్మలదృష్టి ప్రసరింపచేసి నన్నానందములో ముంచివైచి, ఒకచిరునవ్వు నవ్వేసరికి—నే జేసినపని తప్పు అని ఎవరైనా అంటారా అనిపించింది. అయినా నాకు మాత్రము భయమువదలలేదు. ఇంకా ఏమని నిందించునోయని అట్లా నిల్చునే ఉండి పోయాను. 'నాభాగ్యలక్ష్మివి కావాలె' అన్నాను. తనచేయివిడిపించుకొని కొద్దిదూరముగాపోయి నిల్చుంది. 'పరస్త్రీనిట్లు ముట్టుకొన వచ్చునా? మా నాన్నగారితో చెప్తా'ననిమందలించినది. కాని తీవ్రభావములేదు. ఒళ్లుజల్లుమని కంపించింది. శరీరమెల్లయు చిరుచెమటలు పోసినవి. నేను చేసినతప్పు నాకే తెలిసినది, ఆమె పరస్త్రీయా? అయ్యో! ఎంతఘోరపాపము చేసితిని. అచ్చటి బల్లపైకివంగి 'శ్యామలా! నేను తప్పు చేసితిని. నాతప్పు క్షమింపవా' అని అతిదీనముగా అడిగాను. ఈమాటలు ఆమె హృదయమును కొ[illegible]వేసినవి. మొగమున ఒక్కమారుగా కళ పోయినది. తా నేమో మహాఘోరము చేసినదానివలె బెదిరినది. కంటినుంచి రెండు నీళ్ల చుక్కలుకూడా పడినట్లు గ్రహించినాను. తనపైటకొంగుతో మొగముతుడుచుకొన్నది. ఏదియో చెప్పబోయినది. నన్ను నేను దూషించుకున్నాను. నాకింకఅక్కడఉండటానికి ధైర్యము లేకపోయింది. తటాలున తిరిగి వెళ్లిపోయి వచ్చుటకు బయలుదేరాను. అప్పుడే ప్లీడరుగారు లోనకు వచ్చి తిన్నగా యింటిలోనికి వెళ్లిపోయారు. నేనుమాత్రము ఒకప్రక్కగా ఒదిగి ఆయన వెళ్లిపోగానె నా గదికి వచ్చివేశాను అహా, నా కింక సుఖమే లేదనుకున్నాను. ఈజన్మములో శ్యామలను జూచుభాగ్యము కలుగదనినిశ్చయించుకున్నాను. అంతలో మేఘములు ఆకాశము నావరించుకొన్నవి. రాత్రెల్లయు హోరుమని వాన కురియుచుండెను. ఆలోచనాసముద్రతరంగములలో బడి నేను కొట్టుకొనుచుంటిని.

౬

వాన తగ్గినది. ఆ మేఘమండలములో నుండి యొకగొప్పతేజస్సు వెలువడినది. సూర్యభగవానుడే! లోకైకరక్షకుడే! ఏమి? మహాఘోర రాక్షసులవలె నాకాశమునంతయు నావరించిన మేఘముల మధ్య తేజస్సు ఎట్లు దాగినది? నా యీ దుఃఖములుగూడ అంతఆనందదాయకముగాఅంతమగునేమో! యిదియొకవెర్రి ఆశ. అయినను ఆశకు అంతము లేదుకదా? ఆశయే నాకా మహాపట్నములో తావునిచ్చినది. నాయాందోళన కింకను మేరలేదు. యింతలోనే తలుపు

ఎవరో తట్టినట్టయినది. ప్లీడరుగారే. కన్నులుచీకట్లుక్రమ్మివేయుచున్నవి; మేనినిండ చెమటలు క్రమ్మినవి; గుండె దడదడ కొట్టుకొనసాగినది. తండ్రితో చెప్పివేసినది. చెప్పకయుండునేమో ! కాని పాప మామె చేయునదేమి ? తండ్రిగారు ఆసమయమునకే రావలెనా ? తనకూతురితో పరపురుషు డొకడుండుట ఆయన గ్రహించియేయుండును.

ఆయన లోనికివచ్చి కూర్చుండెను. యింకా నేనట్లాగే గుమ్మముదగ్గిర నిలువబడియున్నాను. ఎచ్చటికైనా పారిపోదామా అనిపించింది. యింతలో 'వచ్చేనెలలో వివాహము కావాలె. మీకు ఇష్టములేనియెడల వేరే చూచుకోవాలి. నేను ఆసంగతి మాట్లాడ్డానికే వచ్చాను!' అనిమెల్లగా అనడముతోటే నాకు చాలా ఆశ్చర్యము వేసింది. నాభయమునకు నేనే నవ్వుకున్నాను. 'ఆహా, శ్యామలా!' అని ఆసుగుణమణిని తలపోసి ఆయనదగ్గరగా వెళ్లి కూర్చున్నాను, 'మాతల్లిగారి ఇష్టము. నేను వుత్తరము వ్రాసి మూడునాలుగు రోజులలో చెప్తా' నన్నా, అట్లా అనడానికికూడా రెండు కారణాలున్నాయి. నిజముగా మాతల్లిగారి అనుజ్ఞ అవశ్యము కావలసినదే. అయినా కమలని పెళ్లాడినట్లైతే శ్యామలని చూస్తూండడము సంభవిస్తుందేమో! అది యిర్వురము కూడా భరించగలమా అనుసందేహముఒకటి. ఏమయిన ప్రస్తుతము నిశ్చయముగా ఏమీ చెప్పక తప్పించుకోటానికే యిట్లా చెప్పాను. యింకా చాలాసేపు ఏమేమో మాట్లాడేము. ప్లీడరుగారు వెళ్లిపోయిరి.

౭

వివాహము నిశ్చయమైనది. ఇంక వ్యవధియెంతోలేదు. మావాళ్లంతా వచ్చారు. మా అమ్మకు మాత్రము అపరిమితానందముగా వుంది. కాని నాకు సంతోషము లేదుకదా. దినము దగ్గిరించుచున్నకొలదీ ఆందోళన హెచ్చగుచున్నది. ఆనాడు శ్యామలతో నాకు గలిగిన సమావేశమే నాదృష్టికి గోచరమగుచున్నది. మళ్లీ శ్యామలను చూడడమెట్లా? మరి నేను భరింపశక్యముకాదు. సరే. యీసమయములో ఎవరికి కనబడకుండాఎక్కడికైనా పారిపోదా మనిపించింది. అయినా తల్లిగారికి విచారము కల్పించటము నాకెంత మాత్రము యిష్టముకాదు. మావూళ్లో వున్నప్పుడు ఆరుగంటలు దాటి చీకటి పడ్డతరువాత షికారునుంచి యింటికి రాకపోతే నాకోసము ఎంతో ఆతురతతో ఎదురుచూస్తూ నన్నెంతో ఆదరిస్తూన్నతల్లికి కష్టము కల్పించడమంటే నాకు ప్రాణముపోయినట్లు వుంటుంది. అట్లాంటిది యిప్పుడు ఎట్లా విడిచివెళ్లిపోటము. పోనీ, ఒక వుత్తరమువ్రాసి అందులో రెండుమూడు నెలలలో నిన్ను నేను కలుసుకుని యిప్పటినాచేష్టలకు తగినసమాధాన మిస్తానని వ్రాద్దామనుకున్నా. ఇది నా కంతసంభవముగా తోచలేదు. యింతకు పోనీ శ్యామలనే దర్శించి నన్ను క్షమించేదాక విడువక క్షమార్పణ కోరుకుని రాకూడదా! ఎట్లాగా నాకు కమలతో సౌఖ్యము కలుగదని నిశ్చయించుకున్నాను. నాకు తగిన ప్రేమ ఆపైపై కుదురదేదనే! అయినా కోడలినత్తగారికప్పజెప్పి యే యింగ్లాండోపోయి కొన్నాళ్లుగడిపేసివద్దామని వుంది. మొత్తముమీద మళ్లీ మొండిధైర్యము చేసుకుని మా అత్తారింటికి బయలుదేరాను.

ప్రథమ సమావేశమునాడు జూచిన శ్యామలే! శ్యామలలో కమలకూడ వ్యక్తీకరించినట్లున్నది. నన్నుజూచి లేచి నిలుచున్నది. దగ్గరకు వెళ్లగానే లోనకు వెళ్లటానికి ప్రయత్నించింది. 'శ్యామలా! ఒక్కమాట,' అన్నా. అట్లాగే నిలువబడి పోయింది. నాకు మాట్లాడ్డానికి పెదవులు కదలలేదు. ఒకఉత్తరము తీసియిచ్చేను. అందులో ఏమివ్రాసేనో నాకే తెలియదు. శ్యామలను నావెనుకటి చర్య మరచిపొమ్మని వ్రాసివుంటా. చాలాసేపు అట్లా చూస్తూనే నిలువబడిపోయింది. చటుక్కున నావైపుతిరిగి ఆవుత్తరము నాపైపార వేసింది. 'ఇదినాకనుకున్నా. శ్యామలకు వ్రాసినవుత్తరము నాకెందుకు?' అన్నది. అప్పుడు మళ్లీ తక్షణము చూచేసరికి ఆమె కమలలాగే కనబడ్డది. ఆ ఎంతపని చేశాను. 'ఇంతకు శ్యామలకని వ్రాసినవుత్తరము, కమలా, అట్లా చదువవచ్చునా?' అని కోపము వచ్చింది. నాదుడుకుతనానికి నన్ను నేనే మందలించుకుని 'పోనీ, మీఅక్కయ్య ఏదీ' అన్నా. కమల చిరునవ్వునవ్వింది. మళ్లీ 'అక్కయ్య ఏదీ' అంది.

'మీ శ్యామల.'

'నాకు అక్కయ్య ఎవరు? నా కెవ్వరు లేరు.' అంటూ మొగము వంచుకుని 'నేనే శ్యామలా, నేనే కమలా; యిందులో మీకెవ్వడెవ్వరు కావాలా' అంది. నామనస్సులో మహానందము కలిగింది. ముందుకు అడుగువేసి ఒక మారాకమలాశ్యామలామూర్తిని కౌగిలించుకుని ఒక్కముద్దు పెట్టుకునేసరికి ఆమూర్తిలో నేనుకూడా లీనమైపోయా ననిపించింది.



"ఇది నా కనుకున్నా. శ్యామలకు వ్రాసిన వుత్తరము నా కెందుకు?" అన్నది.